

ప్రత్యేక పోలీసు అధికారిగా సూర్యచంద్రరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు జిల్లాలకు ఎన్నికల సంఘం ప్రత్యేక పోలీసు అధికారులను నియమించింది. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) అడిషనల్ ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావును ప్రత్యేక పోలీసు అధికారిని నియమిస్తూ డిజిపి హరీశ్ కుమార్ గుప్తా శనివారం ఆదేశాలు జారీ చేశారు. నియమకం అంశాన్ని వెంటనే జిల్లా ఎస్‌పి జి.ఆర్.రాధికకు రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

వ్యవసాయం కష్టమవుతోంది

- కుంగదీస్తున్న ప్రకృతి విపత్తులు
- వెంటాడుతున్న చీడపీడలు
- దోచుకుంటున్న దళారులు, వ్యాపారులు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతుధరలేక రైతులు ఓవైపు గిలగిలా కొట్టుకుంటుంటే, అదే పంటతో వ్యాపారం చేస్తున్న దళారీలు, వ్యాపారులు దర్జాగా బతికేస్తున్నారు. దీంతో రోజురోజుకు 'సాయం' కరువవుతున్న వ్యవసాయంలో కొట్టుమిట్టాడుతున్న రైతన్న గత్యంతరం లేని పరిస్థితుల్లో పోరుబాట పడుతున్నాడు. తాను పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, భవిష్యత్‌లో తనకి 'వ్యవ'సాయం' కావాలని దీక్షలు చేపడుతున్నాడు. రైతే రాజు అన్న నానుడి పోయి అయ్యో రైతన్న అనే ప్రస్తుత పరిస్థితికి తలా పాపం తిలా పిడికెడు అన్నట్టు ఓవైపు కుంగదీస్తున్న ప్రకృతి విపత్తులు, మరోవైపు వెంటాడుతున్న చీడపీడలకు తోడు నిలువునా దోచుకుంటున్న దళారీలు, వ్యాపారులకు వత్తాసు పలుకుతున్న ప్రభుత్వాలు కారణమవుతున్నాయి.

ప్రజాశక్తి- కవిటి

జిల్లాలో సుదీర్ఘంగా ఉన్న సముద్ర తీరం రైతాంగానికి సమస్యల తోరణంగా మారుతోంది. 1999లో వచ్చిన సూపర్ సైక్లోన్‌తో ప్రారంభమైన ఈ సమస్యల జడివాన 2018 తిత్లీ తుపానులో తారాస్థాయికి చేరుకుంది. ఈ విపత్తుల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఉన్న ఉద్యానవన పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కొన్ని వేల కొబ్బరి, జీడి చెట్లు నేలకొరిగి పచ్చటి పుడమి తల్లి భోరుమంది. ముఖ్యంగా ఎంతో ప్రసిద్ధి కలిగిన ఉద్దానం కొబ్బరి, జీడి రైతులు ఈ తుపాన్లతో భారీగా నష్టపోయారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో తుపాను ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే జిల్లాలో అధిక ప్రాంతం ఒడిశాకు ఆనుకుని ఉండడంతో తుపాను అక్కడ తాకినా దాని ప్రభావం స్పష్టంగా ఉండడంతో రైతులు భారీగా మూల్యం చెల్లించుకోవలసి వస్తోంది. దీంతో ఏటా అల్పపీడనం ఏర్పడిందంటేనే జిల్లా రైతాంగం గుండెల్లో రైళ్లు పరిగెడుతూ ఉంటాయి. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు ఆ సమయంలో నిద్రలేని రాత్రులు గడుపుతుంటారు.



తుపానుకు నేలకొరిగిన కొబ్బరి చెట్లు (ఫైల్)

దయనీయస్థితిలో రైతన్నల జీవితాలు

ఇటువంటి సమస్యల నడుమ ఉన్న కమతాలు సాగుచేయలేక కుటుంబాలను పెంచి పోషించలేక రైతన్నల జీవితాలు దయనీయస్థితిలో ఉన్నాయి. కూతురు పెళ్లి చేయాలంటే షావుకారి ఏ ముక్క రాయమంటాడో అని భయం, వ్యవ'సాయం' చేస్తున్న కొడుక్కి సంబంధం చూద్దామంటే సాఫ్టువేర్

పెరిగిన వలసలు.. తరిగిన కమతాలు

ఇటువంటి పరిస్థితుల్లో చేసిన అప్పులు తీర్చలేక ఉన్న భూమిని అమ్ముకుని కొందరు ఒడ్డుకు చేరుకుంటుంటే, మరికొందరు ఉపాధి కోసం వలస పోతున్నారు. ముఖ్యంగా ఓవైపు చేసిన అప్పులు, మరోవైపు పెరిగిన జీవన వ్యయం, తరిగిన ఆదాయంతో చిన్న, సన్నకారు రైతులు రియల్టర్లను ఆశ్రయిస్తుంటే పచ్చని తోటలు ఫ్లాట్లుగా మారి పచ్చదనం పోయి పర్యావరణం దెబ్బతింటోంది. కమతాలు కుదించుకుపోయి వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. దీంతో కడలిలో అలజడులు చెలరేగి తరచుగా తుపానులు సంభవిస్తున్నాయి. మరోవైపు వాతావరణంలో వస్తున్న మార్పులతో అయితే అతివృష్టి... లేకపోతే అనావృష్టి తాండవిస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో చేతిలో ఉన్నది విడిచిపెట్టలేక మరోపని చేతకాక 'సాయం' అందని వ్యవసాయంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

మద్దతు ధర లేక...

ఇన్ని బాధలుపడి ఏదో విధంగా పంట పండిస్తే దానికి సరైన మద్దతు ధర లేక సరైన సమయానికి పంట కొనుగోలు చేయక ఇటు దళారులు అటు వ్యాపారులు రైతులను నిలువునా ముంచేస్తున్నారు. మార్కెట్లో గిరాకీ లేదని వ్యాపారులు, వ్యాపారులు తీసుకోవడం లేదని దళారీలు రైతులతో చెడుగుడు ఆడుకుంటున్నారు. జిల్లాలో పండిస్తున్న కొబ్బరికి కానీ, జీడికి కానీ మార్కెట్లో ఎటువంటి గిరాకీ ఉందో అందరికీ తెలిసిందే. అందులో ఉద్దానం పంట అనగానే మరింత ప్రత్యేకమైనదిగా వినియోగదారులు మక్కువ చూపిస్తారు. వీటన్నింటినీ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు మాత్రం నేను, నా కుటుంబం అన్న చందంగా అంతా తమకే కావాలంటూ రైతు నెత్తిన చేయి పెడుతున్నాడు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ గత మూడు నెలలుగా జీడి మద్దతు ధర కోసం రైతులు చేస్తున్న పోరాటమే. మరోపక్క రైతుకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించి రైతులకు అండగా నిలవాల్సిన నాయకులు, ప్రభుత్వాలు వ్యాపారులకే వత్తాసు పలుకుతూ రైతులకు మొండిచేయి చూపిస్తున్నారు. వెరసి ఈ కార్పొరేట్ పాలకుల కుళ్లు రాజకీయాలకు ఆరుగాలం కష్టపడి పండించే రైతన్నల జీవితాలు దోపిడీకి గురవుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతన్న పోరుబాట పడుతున్నాడు.

ఎందుకు నేర్పించలేదంటారేమో ఆందోళన. పిల్లాడికి ఎల్‌కెజిలో చేర్పిద్దామంటే ఎన్ని వేలు అడుగుతారో అన్న అనుమానం. పాపకిపై చదువులు చెప్పిద్దామంటే ఎన్ని పైసలు అడుగుతారో అన్న ఆలోచనలతో రైతుల కుటుంబాలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నాయి. చాలా సందర్భాల్లో ఈ సమస్యలు తీవ్రమై రైతు ఆయుష్షునే బలితీసుకుంటున్నాయి. దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్న చందంగా పంట పండినా కడుపు నిండక, కమతం అమ్మనిదే కష్టం తీరదన్నట్టు ప్రస్తుతం రైతుల పరిస్థితి ఏర్పడింది. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు అన్నట్టు తన కష్టానికి ప్రతిఫలం, భవిష్యత్ రైతాంగానికి భరోసా కల్పించేందుకు ప్రస్తుతం రైతు పోరాడుతున్నాడు.

వెంటాడుతున్న చీడ పీడలు

మరోవైపు గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ రంగాన్ని చీడపీడలు వెంటాడుతూ రైతాంగాన్ని పీల్చిపిప్పి చేస్తున్నాయి. 1999 సూపర్ సైక్లోన్‌తో ప్రారంభమైన ఈ చీడ పీడల బెడద ప్రస్తుతం తారా స్థాయికి చేరుకుంది. కొమ్ము పురుగు, రెక్కపురుగు, ఆకు తొలుచు పురుగు, కాండం పురుగు, ఎర్రనల్లి, నల్ల ముట్టు పురుగు, గ్యానో డేర్మా, రసం పీల్చే పురుగు, ఆకు పురుగు, తెల్లదోమ అంటూ వివిధ పేర్లతో, వివిధ రూపాల్లో కీటకాలు, చీడపీడలు రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. దీంతో ఈ చీడపీడలను నివారించలేక తన పంటను తాను కాపాడలేక ప్రస్తుతం రైతు నిర్వేదంలో కూరుకుపోయాడు. అధిక మొత్తంలో చెల్లించి పురుగు మందులు కొంటున్నా, శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు పాటిస్తున్నా వీటి బెడద నుంచి మాత్రం తప్పించుకోలేకపోతున్నాడు. దీంతో ప్రస్తుతం కొత్త మొక్కలు తయారు చేసుకోలేక, ఉన్న వాటిని కాపాడుకోలేక సతమతమవుతున్నాడు. పాతికేళ్ల కిందట ఇటువంటి కీటకాలు కానీ జబ్బులు కానీ తాను చూడలేదని వాతావరణంలో వచ్చిన మార్పులు, నిరంతరం వస్తున్న ప్రకృతి విపత్తులే వ్యాధులకు తీవ్రతకు కారణమని సరిపెట్టుకుంటున్నాడు.



మాట్లాడుతున్న ఎస్‌పి జి.ఆర్ రాధిక

హడలెత్తించి... హమ్మయ్యా అనిపించి

- ఆకట్టుకున్న పోలీసు మాక్‌డ్రిల్
- పాల్గొన్న ఎస్‌పి రాధిక, ఎఎస్‌పి ప్రేమకాజల్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిత్యం రద్దీగా ఉండే నగరంలో డే అండ్ నైట్ కూడలి వద్ద కొంతమంది ఆందోళనకారులు ప్లకార్డులు పట్టుకొని పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. నిరసన వ్యక్తం చేశారు. ఈలోగా వాహనాలపై వచ్చిన పోలీసులు మొదటగా హెచ్చరికలు జారీచేశారు. అయినా ఆందోళకారులు దిష్టిబొమ్మ, టైర్లను దహనం చేశారు. దీంతో వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఆందోళనకారులు తిరుగుబాటు చేయడంతో భాష్పవాయువు (టియర్ గ్యాస్) ప్రయోగించారు. ఆందోళనకారులు చెల్లాచెదురయ్యారు. మళ్లీ ఆందోళన కొనసాగిస్తుండడంతో రబ్బర్ బుల్లెట్లతో ఫైరింగ్ చేశారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా ఇదంతా చూసిన ప్రజలు హడలిపోయారు. ఇదంతా నిజమని నమ్మి నగరంలో ఏం జరుగుతుందో కొంత సేపు అక్కడున్న వారికి అర్థం కాలేదు.

అయితే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు తీసుకునే చర్యల్లో భాగంగానే శనివారం మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారని తెలియడంతో వారంతా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న ఎస్‌పి జి.ఆర్.రాధిక మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం తుది ఫలితాలు వచ్చేవరకు అల్లర్లు, అసాంఘిక చర్యలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం నగరంలోని డే అండ్ వైట్ కూడలి వద్ద మాబ్ ఆపరేషన్-మాక్ నిర్వహించామన్నారు. ఈ మాబ్ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం పోలీసులు సన్నద్ధత, ప్రజల్లో అవగాహన, చైతన్యం తీసుకొచ్చేందుకు దోహదపడుతుందన్నారు. జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమల్లో ఉన్నందున అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల మూకలను నియంత్రించడమే లక్ష్యమన్నారు. ఒకేచోట నలుగురు కన్నా ఎక్కువ మంది గుమిగూడి ఆందోళనలు, హింసాత్మక ఘటనలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై లాఠీచార్జి, ఫైరింగ్ చేయడానికి వెనకాడబోమని ఆమె హెచ్చరించారు. ప్రజలు ఎవరు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యల్లో పాల్గొనవద్దని కోరారు. ఓట్లు కౌంటింగ్ రోజు ఎవరైనా అల్లర్లకు ఘర్షణలకు, హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే ముందస్తు అరెస్టు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో లూజు పెట్రోల్ విక్రయాలు నియంత్రించామని తెలిపారు. పేలుడు పదార్థాలు, బాణసంచా విక్రయాలకు అనుమతి రద్దు చేశామన్నారు. ఓట్లు కౌంటింగ్ తుది ఫలితాలు అనంతరం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహణకు అనుమతులు లేవని పేర్కొన్నారు. శాంతియుతంగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు జిల్లా పోలీసులు యంత్రాంగానికి పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ జి.ప్రేమకాజల్, దిశ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రినాయుడు, సిఐలు ఎల్.సన్యాసినాయుడు, ఉమామహేశ్వరరావు, ఆర్ఐలు సురేష్, రమేష్, కె.వి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో దాహం కేకలు

- ఎండిన బావులు, నదులు
- ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో వేసవి నీటి ఎద్దడి రోజు రోజుకీ తీవ్రతరం అవుతుంది. బాహుదా నదిలో నీరు లేక పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. నీటి నిల్వ కోసం బాహుదా నదిలో తాత్కాలిక గట్టు కట్టారు. దీంతో నదిలో నిరు నిల్వ ఉండేది. ఇప్పుడు ఆ గట్టుకొట్టుకుపోవడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పట్టణంలో అనేక వీధిల్లోని బోర్ల నుంచి నీరు రాకపోవడంతో దినవారి చర్యలకు అనేక ఇక్కట్లు పడుతున్నారు. పట్టణంలో బెలుల్పడా, లాలాపేటలోని తాగునీటి బావులు అడుగంటిపోయాయి. 1,2,3 వార్డులైన పురుషోత్తంపురం, అమిన్‌సాహెబ్‌పేటలో నిత్యం ట్యాంకర్ల నీటిపైనే ఆధారం. సాధారణ రోజుల్లోనూ రోజుకు నాలుగైదు ట్యాంకర్ల నీరు అవసరం. మున్సిపల్ అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకుని తాగునీటి సమస్య పరిష్కారంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు, కౌంటింగ్ నేపథ్యంలో నీటి సమస్యపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం ఇబ్బందిగా మారింది. ప్రజల అవసరాలు దృష్ట్యా అదనపు ట్యాంకర్‌తో నీటి ఎద్దడి ప్రాంతాలు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 23 వార్డులు ఉన్నాయి. 1, 2, 3, 18, 19, 20 వార్డులతో పాటు పలు వీధుల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. 15 ఏళ్ల కిందట మున్సిపాలిటీలో 28 వేల జనాభాకు అనుగుణంగా నీటి పథకానికి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 36 వేలకు జనాభా పెరిగింది. అదేస్థాయి నీటి వాడకమూ అధికమైంది. బాహుదా నదిలోని ఊట బావుల నుంచి పంపుహౌస్‌కి నీటి సరఫరా చేసి క్లోరినేషన్ చేపట్టి రాజావారితోటలోని 8 లక్షల లీటర్ల రిజర్వాయరు ద్వారా మున్సిపాలిటీ ప్రజలకు నీటిని అందిస్తున్నారు. పురుషోత్తపురం, ఏఎస్పేటకు (1,2,3 వార్డులు) కుళాయిల ద్వారా నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లు నాణ్యతా లోపం కారణంగా లీకులయ్యాయి. పురుషోత్తపురం పుష్పగిరి కొండపై 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వినియోగంలో లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో ఈ మూడు వార్డులకు మూడు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నీరు లేక ఇబ్బంది పడుతున్నామని, రోజూ నీటిని సరఫరా చేయాలని అధికారులను కోరుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కూడా కనీసస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో తాగునీటి పథకం నిర్వహణ పనులు సక్రమంగా సాగడం లేదని వాపోతున్నారు.



బాహుదానదిలో అడుగంటిన నీరు

శాంతిభద్రతలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి- టెక్కలి

పోలింగ్ అనంతరం ఎటువంటి ఆవాంఛీనీయ ఘటనలు జరగకపోయినా... ఎన్నికల ఫలితాలు అనంతరం ఎక్కడా ఘర్షణలు, వివాదాలు జరుగుకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి తహశీల్దార్లు, పోలీస్ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. అనుమానం కలిగిన చోట ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపాలన్నారు. కార్డాన్‌సెర్చ్ పక్కాగా, పటిష్టంగా చేపట్టాలన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సదస్సులో టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తహశీల్దార్లు, డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ పైడయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



సమీక్షిస్తున్న డిఎస్‌పి నాగేశ్వరరావురెడ్డి

4న ర్యాలీలు నిషేధం

కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావురెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జూన్ 6 వరకు ఎన్నికలు కోడ్ అమలులో ఉందని, రాజకీయ పార్టీల నాయకులు జాగ్రత్తలు పాటించాలని కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావురెడ్డి సూచించారు. సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 4న ర్యాలీలు, ఊరేగింపులు రద్దు చేశామన్నారు. అలాగే బాణసంచా విక్రయంపైనా నిషేధం విధిస్తున్నట్లు చెప్పారు. టపాసులు విక్రయించినా, కాల్చినా బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సిఐ టి.ఇమ్మాన్యుయల్‌రాజు, మల్లేశ్వరరావు, ఎస్ఐలు సత్యనారాయణ, లక్ష్మణరావు, రాము పాల్గొన్నారు.



కారుపై పడిన చెట్టు

రెప్పపాటులో తప్పిన ముప్పు

కారుపై కూలిన చెట్టు

ప్రజాశక్తి- కవిటి

రెప్పపాటులో పెను ప్రమాదం తప్పింది. వెళ్తున్న కారుపై ఓ భారీ మోడువారిన చెట్టు ఉన్నపళంగా పడిపోవడంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భయానక వాతావరణం ఏర్పడింది. దీంతో కారులో ఉన్నవారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నెలవంకకు చెందిన దుర్గాశి దిలీప్ తన కారులో గ్రామానికి చెందిన ఇంకో వ్యక్తితో కలిసి కవిటి వైపు వెళ్తున్నారు. కవిటి అశోక్ థియేటర్ వద్దకు వచ్చేసరికి రోడ్డు పక్కనే ఉన్న ఓ మోడు వారిన వృక్షం ఒక్కసారిగా వారి కారుపై పడింది. అనుకోని ఈ సంఘటనకు కారులో ఉన్న దిలీప్ ఒక్కసారి గా హడలిపోయినా కారు ఎయిర్ బేగ్స్ తెరుచుకోవడంతో ఇద్దరూ చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. అయితే చెట్టు బలంగా కారుపై పడడంతో కారుముందు భాగం పూర్తిగా దెబ్బతింది. అను కోని ఈ సంఘటనతో సమీపంలో ఉంటున్నవారు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. మోడు వారిన ఈ చెట్టు తొలగిం చాలని ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయిం దని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికైనా ఏదైనా జరిగుంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు పక్కనే ఉన్న మోడువారిన వృక్షాలు తొలగించాలని డిమాండ్ చేశారు.

ఐదుగురు విద్యార్థులు... 9 మంది సిబ్బంది

ప్రజాశక్తి- టెక్కలి

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో విచిత్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ పరీక్షల్లో శనివారం పరిశీలిస్తే... పరీక్షలపై విద్యార్థులకు ఎటువంటి శ్రద్ధ ఉన్నది అన్నది స్పష్టంగా అర్థమవుతుంది. వివరాల్లో వెళ్తే... టెక్కలి బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. శనివారం హిందీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి మండలాల నుంచి పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 57 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే శనివారం నిర్వహించిన పరీక్షకు 52 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో ఐదుగురు విద్యార్థులతోనే పరీక్షలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఐదుగురు విద్యార్థుల్లో ముగ్గురు విద్యార్థులకు ఒక రూమ్ చొప్పున కేటాయించారు. ఒక్కో విద్యార్థికి ఒక్కొక్క రూమ్ చొప్పున కేటాంచారు. ఈ పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఉత్తరకవాటం గణపతిరావు వ్యవహరించారు. డిపార్ట్‌మెంట్ అధికారిగా బమ్మిడి శేషగిరి వ్యవహరించారు. ఐదుగురు విద్యార్థులకు మూడు రూమ్‌లు కేటాయించడంతో ముగ్గురు ఇన్విజిలేటర్లు, ఇద్దరు ఆరోగ్య సిబ్బంది, ఇద్దరు కార్యాలయ అటెండర్లు, ఒక కానిస్టేబుల్ మొత్తం కలిపి ఐదుగురు విద్యార్థులకు 9 మంది సిబ్బంది విధుల నిర్వర్తించడం గమనార్హం.

ఏమైపోయారు వాళ్లంతా?



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మీకు మేమున్నాం.. మీ సమస్య ఏంటో చెప్పండి క్షణాల్లో పరిష్కరిస్తాం.. ఓటరు వెళ్లి అడిగిందే తడవు.. ఏ పనైనా రోజుల్లో జరిగిపోయేది. పోలింగ్ ముందు వరకూ అదే పరిస్థితి ఉండేది. తర్వాత సీన్ మారింది. ఇప్పుడు నాయకులు కనిపించడమే మానేశారు. అభ్యర్థుల క్యాంపు కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు బోసిపోయాయి. పోలింగ్ ముగిసిన నాటి నుంచి నాయకులు బయటకే రావడం లేదు. కొంతమంది విహార యాత్రలకు వెళ్లగా, కొంతమంది స్థానికంగా ఉన్నవారు సైతం ఇళ్లకే పరిమితమవుతున్నారు. నాయకులు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో వీళ్లంతా ఏమైపోయారో అని అంతా అనుకుంటున్నారు. పోలింగ్ సరళి తమకంటే తమకే అనుకూలంగా ఉందంటూ ఇరు పార్టీలు తమకనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేశారు. జిల్లాలో అత్యధిక స్థానాల్లో తామే గెలుస్తామని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వమే మళ్లీ ఏర్పాటవుతుందని వైసిపి ప్రజాప్రతినిధులు ప్రకటనలు గుప్పించారు. జిల్లాలోని అన్ని సీట్లలో టిడిపి జెండా ఎగురవేయబోతున్నామని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాబోతుందంటూ టిడిపి నాయకులు జోస్యం చెప్పారు. ఇప్పటికీ నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న అభ్యర్థులు తమకు వచ్చే ఓట్లపై ఎడతెరిపిలేని చర్చలు జరుపుతున్నారు. పోలింగ్ బూత్‌ల వారిగా లెక్కలు కడుతూ కుస్తీలు పడుతున్నారు. లెక్కలన్నీ తేలాక గెలుపుపై ఒక అంచనాకు వస్తున్నారు. బొటాబొటీ మెజార్టీతో నైనా గట్టెక్కుతామని కొందరు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయినా మనసులో ఏదో మూల రేకెత్తిన ఆందోళన వారిని స్థిమితంగా ఉండనీయడం లేదు. జూన్ నాలుగో తేదీ ఎప్పుడు వస్తుందా? అని క్షణమొక యుగంలా గడుపుతున్నారు. ప్రజా సమస్యల జోలికి వెళ్లడం లేదు.

ఓట్ల కోసం తమ చుట్టూ తిరిగిన అభ్యర్థులు పోలింగ్ తర్వాత కనిపించకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక జనం అయోమయంలో ఉన్నారు. సమస్యలు చెప్పుకునేందుకు గతంలో స్పందన కార్యక్రమం నిర్వహించేవారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత వినతుల స్వీకరణను ఆపేశారు. మరోవైపు నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో తమ పాత్ర ఏమీ లేనట్లుగా ప్రజాప్రతినిధులు భావిస్తున్నట్లుగా ఉంది. ఎన్నికల ఫలితాల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులే చూసుకోవాలి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కొన్ని పరిమితులకు లోబడి పాలన కొనసాగించే అవకాశం ఉంది. విధాన నిర్ణయాలు, ఓటర్లను ప్రభావిత చేసే నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తలు పాటిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించే అవకాశం ఉన్నా తమకెందుకులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆర్డినెన్స్‌ల జారీ, ఉన్నతాధికారుల బదిలీలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి అంశాల జోలికి వెళ్లకుండా రోజు వారీ ప్రభుత్వ కార్యకలాపాలను చేసుకునే వెసులుబాబు పాలకులకు ఉంది. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తీర్చవచ్చు. ఎన్నికలు అయిపోవడంతో ప్రజల సమస్యలు మనకెందుకు అనే తీరుతో ప్రజాప్రతినిధులు ఎవరి సొంత పనులు వాళ్లు చూసుకుంటున్నారు.

అధికార యంత్రాంగమూ ప్రజా సమస్యలపై సమీక్షలు చేయని పరిస్థితి నెలకొంది. జూన్ నాలుగో తేదీన నిర్వహించనున్న కౌంటింగ్‌పైనే ప్రధానంగా దృష్టి సారించారు. రోజంతా ఓట్ల లెక్కింపుపై సమీక్షలు, స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన వంటి కార్యక్రమాలతోనే నెట్టుకొస్తున్నారు. నామినేషన్ల స్వీకరణకు ముందు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షలు జరుపుతూనే మరోవైపు తాగునీరు, ఉపాధి హామీ తదితర ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్షలూ నిర్వహించారు. పోలింగ్ తర్వాత మాత్రం కేవలం ఓట్ల లెక్కింపు అంశాలకే జిల్లా యంత్రాంగం పరిమితమయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ మొదలవుతుండటంతో రైతులు విత్తనాలను సమకూర్చుకునే పనిలో ఉన్నారు. గతేడాది వరి విస్తీర్ణం ప్రాతిపదికన కాకుండా రాజకీయ పార్టీ నాయకుల సిఫార్సులకు అనుగుణంగా విత్తన కేటాయింపులు జరిపారన్న విమర్శలు ఉన్నాయి. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ప్రక్రియను ఇప్పుడు ప్రారంభిస్తేనే వారికి జూలై నాటికయినా పంట సాగు హక్కు పత్రాలు అందే పరిస్థితి ఉంది. వంశధార కాలువల్లో పూడికతీత పనులు సరకమంగా జరగకపోవడంతో గత ఖరీఫ్‌లో శివారు భూములకు సాగునీరందక పంటలు ఎండిపోయిన పరిస్థితిని చూశాం. ఈ నేపథ్యంలో అత్యంత ప్రాధాన్యత ఉన్న అంశాలపై జిల్లా యంత్రాంగమే చొరవ చూపి ప్రత్యేక సమీక్షలు జరపాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.


చిత్రపటాన్ని స్వీకరిస్తున్న సిసిఎల్ఎ సాయిప్రసాద్

అరసవల్లిని సందర్శించిన సిసిఎల్ఎ సిఎస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేటర్ అండ్ రెవెన్యూ (సిసిఎల్ఎ) చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహిస్తున్న పలు సేవల్లో వారు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో వారికి స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం చిత్రపటాన్ని ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ అందజేశారు. వారితో పాటు జెసి ఎం.నవీన్, ఆర్‌డిఒ సి.హెచ్.రంగయ్య, తహశీల్దార్ బి.వి.రాణి పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఆర్‌డిఒ భరత్ నాయక్

పలాస: వచ్చే నెల 4న ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం దృష్ట్యా అన్ని ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ సూచించారు. ఆర్‌డిఒ కార్యాలయంలో పోలీసు, ఎఆర్‌ఒ, సిఎల్ఎస్ అధికారులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో కొన్ని ప్రాంతాల్లో వివాదాలు, అల్లర్లు వంటి సంఘటనలు జరిగాయన్నారు. కౌంటింగ్ దగ్గర పడుతున్న క్రమంలో ప్రధాన పార్టీల అనుచరుల మధ్య గెలుపోటములపై మాటల యుద్ధం పెరుగుతుందన్నారు. దీని దృష్ట్యా కౌంటింగ్ ముందు, ఫలితాలు వచ్చిన తరువాత కొద్దిరోజుల పాటు సమస్యాత్మక ప్రాంతాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల్లో ఎంత మందిపై కేసులు నమోదు చేశారు. ఎంత మందిని బైండోవర్ చేసి కోర్టుకు తరలించారని విషయమై నివేదిక అందించాలన్నారు. బైండోవర్ కేసులు నమోదైన వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా కొత్త వ్యక్తులు నియోజకవర్గానికి వస్తే అదుపులోకి తీసు కోవాలన్నారు. సమావేశంలో ఎసిపిలు పారినాయుడు, వెంకటరావు, రూరల్ సిఐ, వజ్రపుకొత్తూరు ఎస్ఐ, ఎఆర్‌ఒలు, సిఎల్ఎస్‌లు పాల్గొన్నారు.


బూర్జ : ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

గ్రామాల్లో కార్డాన్‌సెర్చ్

బూర్జ: మండలంలో వీదివలసలో శనివారం ఎస్‌పి రాధిక ఆదేశాల మేరకు ఎస్ఐ జి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. గ్రామంలో ఆరు ద్విచక్ర వాహనాలకు పత్రాలు లేనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతిఒక్క వాహనానికి సక్రమంగా పత్రాలు ఉండాలన్నారు. అనంతరం కొల్లివలస జంక్షన్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు.

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలో ఎస్ఐ సిహెచ్ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు, ప్రత్యేక బలగాలతో కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. మద్యం, సారాయి, గంజాయి వంటివి నిల్వ చేస్తే కఠిన చర్యలు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు

రగ్బీ జిల్లా జట్టు ఎంపిక

టెక్కలి: ఈ నెల 30 నుంచి జూన్ ఒకటి వరకు విశాఖ జిల్లా భీమిలి మండలం తాడికొండ వద్ద జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు జిల్లాస్థాయి జట్టు ఎంపిక ప్రక్రియ శనివారం చేపట్టారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో భాగంగా జట్టుకు సంబంధించి 24 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. బాలుర, బాలికల జట్లులను వేర్వేరుగా చేపట్టిన ఎంపిక జట్లులను అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొంకాన రామకృష్ణ, పొన్నాడ పార్వతీశంలు జట్టుని అభినందించారు. అవసరమైన సంబంధించిన నగదును అందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టు ఎంపికలో ఆర్గనైజింగ్ కార్యదర్శి నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, కాపల రఘునాథరావు, రాజా, శైలజ, అనిల్, సీతయ్య పాల్గొన్నారు.


కేకు కట్ చేసిన పద్మజ

ఘనంగా పద్మజ జన్మదినం

పలాస: కాశీబుగ్గ సూర్యతేజ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల కరస్పాండెంట్, టిడిపి నాయకురాలు దానేటి పద్మజ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో దానేటి కామేశ్వరరావు, ఆదాల మురళి, కూన వాసుదేవరావు, పైల దేవిక, పి.శ్రావణి, జి.సుధాకర్, వి.మురళి, కోనారి చిరంజీవి, రామారావు, బాలకృష్ణ, కోరండరావు, సురేష్, వెంకటరావు, తిరుపతిరావు, కుమార్, కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి

కోటబొమ్మాళి: సమగ్ర శిక్షా అభియాన్ రాష్ట్ర సంచాలకుల ఆదేశానుసారం వికలాంగ విద్యార్థులను సర్వే ద్వారా గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న సర్వేలో ఇప్పటి వరకు 19 మంది వికలాంగులను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించామన్నారు. భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు, కల్పిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఇందులో భాగంగా కురుడులో మెంద పక్కిరాజు గుర్తించి ఆరో తరగతిలో చేర్పించడం జరిగిందన్నారు. సహిత ఉపాధ్యాయులు దేవమణి, శంకర్, చంద్రికలు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువతరం

ప్రజాశక్తి- కవిటి

సొంత లాభం కొంతమానుకుని పొరుగువానికి సాయపడవోయ్...దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్... అన్న గురజాడ కవితను నేటి యువతరం నరనరాల్లో జీర్ణించుకుంటోంది. ఆపద సమయంలో తాము అనుభవించిన వేధన, తమ కుటుంబ నేపథ్యం, సామాజిక పరిస్థితులు చూసి చలించిపోయి తమలా మరొకరు బాధపడ కూడదనే దృఢ సంకల్పంతో చేయిచేయి కలుపుతోంది నేటి యువత. అందులో భాగంగా ప్రతి గ్రామంలో స్వచ్ఛంద సంస్థలుగా ఏర్పడి ఆపద అంటే సరే పద అంటూ ఆర్తులకు అండగా నిలుస్తున్నారు. కష్టం వచ్చిందని తెలిస్తే కన్నీరు కారుస్తూ కూర్చోకుండా చేయి చేయి కలిపి ఆ కష్టానికే కన్నీరు తెప్పిస్తున్నారు.

పోషిస్తున్న కీలకపాత్ర

ఇటీవల కాలంలో ఎక్కడ ఎటువంటి సంఘటన జరిగినా, ఎవరు ఆపదలో ఉన్నారని తెలిసినా వారికి అండగా నిలిచేందుకు స్వచ్ఛంద సంస్థలు సిద్ధంగా ఉంటున్నాయి. ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఉంటూ తమ పరిధిలో ఉన్న సమాచారం సంస్థకు తెలియజేస్తున్నారు. ఇటీవల కాలంలో బొరివంకకు చెందిన హెల్పింగ్ హేండ్స్, కుసుంపురానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం,


రక్తదానం చేస్తున్న యువకులు (ఫైల్)


చిన్నారి వైద్యం కోసం రూ.78,801లు అందిస్తున్న యువత (ఫైల్)

ఉద్యోగ, ఉపాధ్యాయులు నడుస్తున్న డాక్టర్ అబ్దుల్ కలామ్ ఫౌండేషన్, అత్యంత విస్తృతమైన నెట్వర్క్ కలిగిన ఎస్‌జిఎఫ్, అలాగే అన్నవరం హెల్పింగ్ హాండ్స్, జైహింద్ ఫౌండేషన్, రక్షణ ఫౌండేషన్, పవన పుత్ర సేవా సమితి, ఉద్దానం ఫౌండేషన్, సిక్కోలు ఉద్దానం సేవా సమితి, ఆ నలుగురు, మృత్యుంజయ ఫౌండేషన్, సీతయ్య ఫౌండేషన్, హనుమాన్ హెల్పింగ్ హేండ్స్ తదితర స్వచ్ఛంద సంస్థలు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్తులు, అభాగ్యులకు అండగా నిలుస్తున్నాయి.

రక్తదానంపై తొలగిన అపోహలు

గతంలో ఒక మనిషి ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం అవసరమైనప్పుడు రక్తదాత పక్కనే ఉన్నా రక్తం ఇచ్చేందుకు ముందుకు వచ్చేవారు కాదు. తాము రక్తం ఇస్తే తాము అనారోగ్యానికి గురవుతామని, రక్త దానం అనేది మంచి పద్ధతి కాదనే అపోహ అప్పట్లో వారిలో బలంగా నాటుకుపోయింది. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారింది. స్వచ్ఛంద సంస్థలు, సామాజిక స్పృహ మెండుగా ఉన్న యువతరం విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఏ ఆస్పత్రిలో రక్తం కోసం రోగులు ఎదురు చూస్తున్నారని తెలిసినా వెంటనే అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తున్నారు. గ్రామాల్లో రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించి, రక్తదానం చేయాలని యువతని ప్రోత్సహి స్తున్నారు. ఈ కార్యక్రమం ఆస్పత్రిలో రక్తం కోసం ఎదురు చూస్తున్న కొన్ని వేల మందికి జీవం పోస్తోంది.

చిన్ని గుండెకు... పెద్ద స్పందన

మండలంలోని ఎల్‌హెచ్‌ఎల్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 9 నెలల చిన్నారి ఆధ్య దయనీయ పరిస్థితి వివరిస్తూ గతేడాది ఆగస్టు 15న 'ప్రజాశక్తి'లో 'చిన్ని గుండెకు పెద్ద కష్టం' అంటూ కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి అటు స్వచ్ఛంద సంస్థలు, ఇటు యువతరం నుంచి అనూహ్య స్పందన లభించింది. ఎంతలా అంటే కేవలం పది రోజుల్లోనే పాప వైద్యానికి అవసరమైన రూ.18 లక్షలు దాటి దాతలు అందించారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు, నేటి యువతరం పాత్ర నభూతో నభవిష్యత్ అనేలా సాగింది.

కొన్ని కన్నీటి గాథల నుంచి పుట్టిన ఆలోచన..



2013లో నేను పదో తరగతి చదివినప్పుడు వలస కూలీగా ఉన్న మా గ్రామానికి చెందిన వ్యక్తి అండమానులో కొబ్బరి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పుడు అతని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో మా స్నేహితులమంతా కలిసి రూ.25 వేలు అందించాం. అదే మేము ఒక సంస్థగా ఏర్పడితే ఎంతో మందికి అండగా నిలవచ్చనే ఆలోచన ఏర్పడింది.

- కాళీ సాహు, హెల్పింగ్ హేండ్స్ సభ్యుడు, బొరివంక


జాబ్‌మేళాలో అభ్యర్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీతారాం

హెచ్‌పిఎన్ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపాన గల హెచ్‌పిఎన్ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. హెటెరో ఫార్మా కంపెనీ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలను నిర్వహించారు. బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కంపెనీ యాజమాన్యం ఈ ఎంపికలను నిర్వహించింది. హెచ్‌పిఎన్ కళాశాలతో పాటు ఇతర కాలేజీల నుంచి విద్యార్థులు ఈ ఎంపికకు హాజరయ్యారు. వారిలో అర్హత, నైపుణ్యం ఉన్న వందమందిని శిక్షణకు ఎంపిక చేశారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశం కల్పిస్తున్నట్టు కంపెనీ హెచ్‌ఆర్ నరేష్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కళాశాల ప్రిన్సిపాల్ తమ్మినేని సీతారాం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

29న లావేరు మండల సమావేశం

ప్రజాశక్తి- లావేరు

ఈ నెల 29న ఉదయం 11 గంటలకు ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన జరుగు మండల సర్వసభ్య సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరు కావాలని ఎంపిడిఒ ఎస్.కొండలరావు కోరారు. అలాగే అన్నిశాఖల అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో విధిగా హాజరు కావాలని ప్రకటనలో తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి వద్ద సేవా ఫౌండేషన్ ఆధ్వర్యాన ఈ నెల 26న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సేవా పౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతి రాజు, సూర్య ఆస్పత్రి వైద్యులు ఇడదాసుల యశ్వంత్ ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవు తుందన్నారు. రక్తదాతలు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపు నిచ్చారు. మరిన్ని వివరాలకు 9848004156 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.


ప్రపంచ దేశాల కోసం వివరిస్తున్న రిసోర్స్‌పర్సన్ భాస్కరరావు

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి- లావేరు

ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయిలో ప్రపంచ దేశాల కోసం తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్ ఎం.భాస్కరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శనివారం ప్రపంచ పటం, ప్రపంచ ఖండాలు, ప్రపంచ దేశాలను గ్లోబ్ ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. అలాగే ప్రపంచ సముద్రాలు, ప్రధాన దీవులు, దీపకల్పములు, పర్వత శిఖరాలు, ఎడారులు, సరస్సులు, జలపాతం కోసం విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం : ఆటలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని శాఖాగ్రంథాలయాధికారి ఎస్.ఉదయకిరణ్ అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సీనియర్స్, జూనియర్స్ క్యార్మ్స్ పోటీలు నిర్వహించారు.

టెక్కలి: విద్యార్థి దశ నుంచే చిన్నారులు, పిల్లలు వివిధ రకాల కథలు చదవడం ద్వారా తమ ఆలోచనాశక్తి పెరుగుతుందని టెక్కలి గ్రంథాలయాధికారి బి.రూపావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథలు, పుస్తకాలు చదివించారు. కథలు చదవడం వలన ఆలోచనలు పెరుగుతాయన్నారు. సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తాం

టెక్కలి : గ్రామాల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు అవసరమైన నీటి తొట్టెలు ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని టెక్కలి పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రఘునాథరావు అన్నారు. ఈ నెల 24న ప్రజాశక్తిలో6 'మూగజీవాలు విలవిల' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఆయన స్పందిస్తూ... గ్రామాల్లో నీటి ట్యాంక్‌లు పక్కన ప్రభుత్వ స్థలం ఉన్నట్లు రైతులు గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. శాఖాపరంగా నీటి తొట్టెల నిర్మాణం చేపడతామని తెలిపారు. పాడి రైతులకు అండగా పశువుల దాహార్తి తీర్చేందుకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస



విత్తనాల కోసం వ్యవసాయాధికారిని ప్రశ్నిస్తున్న జెడ్‌పిటిసి నాగేశ్వరరావు

సరుబుజ్జిలి మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన మండల సమావేశంలో ప్రజా సమస్యలు చర్చకు రాకుండానే ఐదు నిమిషాల్లోనే ముగించి మమా అనిపించారు. ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. ముందుగా ఎంపిడిఒ ఎం.రత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సంఘ నిబంధనలు అమల్లో ఉన్నాయని, ప్రణాళిక ప్రకారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉన్నందున ఎటువంటి సిఫార్సులు, హామీలు, సమస్యలపై చర్చలు చేయకూడదని సభ్యుల హాజరుతో సమావేశం ముగిస్తున్నట్లు ప్రకటించారు. జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు ఖరీఫ్‌కు అవసరమైన వరి విత్తనాల పరిస్థితి ఏమిటని మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభంను వివరణ కోరగా మండలంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలపై చర్చించడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని పలువురు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పెదవి విరుస్తున్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశంలో సమస్యలపై చర్చించకుండా ఇలా సమావేశాన్ని ఐదు నిమిషాల్లో ముగించడం సరికాదని పలువురు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ జి.రమేష్ బాబు, వైస్ ఎంపిపి జి.వి.శివానందమూర్తి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.


రక్తదానం చేసిన వారితో ఆర్ట్స్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

మండలం పెద్దపేటలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్ట్స్‌సంస్థ 30 వసంతాలు పూర్తి చేసిన సందర్భంగా ఆర్ట్స్, రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్తంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 102 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న పాలకొండకు చెందిన ముంజి మురళీకృష్ణ 40వ సారి రక్తదానం చేశారు. అలాగే బూర్జ గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ శాహిన్ష ఎనిమిదో సారి రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఆర్ట్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, నూక అనూప్, శ్రీకాకుళం రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ జగన్మోహనరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో రక్త నిల్వలు తక్కువగా ఉంటున్న నేపథ్యంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డిడిఎం రమేష్ కుమార్, వరప్రసాద్, మన్యం జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధి శ్రీరాములు, పెంకి చైతన్య కుమార్, మాజీ సిఇఒ మోహనరావు, మాజీ జెడ్‌పిటిసి రామకృష్ణ నాయుడు, టిట్కో డైరెక్టర్ గోవిందరావు, బి.శంకరరావు, సందీప్, ప్రసన్న, పద్మ పాల్గొన్నారు.

సంఘాలకు పుస్తక నిర్వహణే కీలకం

ప్రజాశక్తి- ఆమదాలవలస


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

మహిళలు స్వయంశక్తితో నిర్వహిస్తున్న పొదుపు సంఘాలన్నింటికీ పంచ సూత్రాల్లో భాగంగా రికార్డుల నిర్వహణ అతి ముఖ్యమైనదని వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తమ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండల పరిధిలో గల 30 గ్రామ సంఘాలు, 1178 స్వయంశక్తి సంఘాలకు ప్రతినెలా సమావేశ తీర్మానంతో పాటు పొదుపు, అప్పులకు సంబంధించి అన్ని ఆర్థిక లావాదేవీలను పుస్తకాల్లో నమోదు చేసుకుని సభ్యులందరికీ పారదర్శకంగా ఉండాలని తెలిపారు. ప్రతి సంఘానికి నెలవారీ వచ్చిన వడ్డీలు, ఇతర ఆదాయ, వ్యయాలను ఖచ్చితంగా పుస్తకాల్లో నమోదు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆసరా, చేయూత సున్నా వడ్డీ నిధులన్నింటిపై సభ్యులందరికీ అవగాహన ఉండాలని, రికార్డుల నిర్వహణ జవాబుదారీగా, కీలకంగా ఉండేటట్లు గ్రామాల్లో అన్ని సంఘాలకు అవగాహన కల్పించాలని, అన్ని సమావేశాల్లో పుస్తక నిర్వహనే ప్రధాన ఎజెండాగా మాట్లాడి ఆర్థిక లావాదేవీలన్నింటిపై సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.


బాలల సంరక్షణలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యం



'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బాలల సంరక్షణలో తల్లితండ్రులు ముఖ్యపాత్ర పోషిస్తారని, వారికి చదువు అదేవిధంగా మంచి సంస్కారం నేర్పడంతో పాటు వారి రక్షణ బాధ్యతనూ ముందుగా తల్లిదండ్రులు స్వీకరించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. అంతర్జాతీయ తప్పిపోయిన బాలల కోసం ప్రత్యేక రోజుగా గమనించడం సందర్భంగా మండలంలోని అక్కయ్యవలస గ్రామ చెరువు గట్టు వద్ద ఉపాధి హామీ కులీతో, గ్రామస్తులతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ పనులకు, ఉద్యోగాల నిమిత్తం తల్లిదండ్రులు ఇళ్లు వదిలి బయటకు వచ్చినప్పుడు, వారి పిల్లలను పూర్తి నమ్మకం ఉన్నవారి దగ్గర ఉంచడం, చదువులకు మాత్రమే వారు పరిమితమయ్యేలా వారికి చిన్నప్పటి నుంచి మంచి జీవన విధానాలను నేర్పడం చేయాలని అన్నారు. పిల్లలు ఎవరెవరితో సాంగత్యం కలిగి ఉన్నారు, వారి స్నేహితులెవరు, వారందరితో మాట్లాడడం, పిల్లల పరివర్తన మార్పులను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో లఖినేని శ్రీనివాసులు, జి.హరిప్రసాద్, నిర్మల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ నిహార్

నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి మండలంలో అమల్లో ఉన్న ఎన్నికల సంఘ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని తహశీల్దార్ జి.రమేష్ బాబు, ఎస్ఐ బి.నిహార్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, గ్రామస్థాయి అధికారులతో ఎన్నికల నిబంధనల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎన్నికలకు ముందు 36 బైండోవర్ కేసులు నమోదు చేశామని, ప్రస్తుతం కౌంటింగ్ రోజు కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మరో ఎనిమిది బైండోవర్ కేసులను అదనంగా నమోదు చేసి తహశీల్దారు కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన వ్యక్తులను హాజరుపరచడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఫలితాలు వెలువడే రోజు ఎటువంటి బాణాసంచా, ఊరేగింపులు, గుముగూడి చర్చలు జరపడం వంటివి నిషేధించడమైనదని, వీటిని ప్రతిఒక్కరూ పాటించి గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలోని కుద్దిరాం మండల పరిధిలో దన్నానపేటలో ఎన్నికల సంఘం నిబంధనలపై తహశీల్దార్ కె.వేణుగోపాల్, ఎస్ఐ కె.వెంకటేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. రెవిన్యూ, పోలీస్ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతదేహం

ప్రజాశక్తి- పోలాకి

మండలం పల్లిపేట వంశధార నది ఒడ్డున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పల్లిపేటకు ఆనుకునిఉన్న వంశధార నది ఒడ్డున సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం 3 గంటల ప్రాంతంలో స్థానికులు గుర్తించారు. వెంటనే సచివాలయ విఆర్ఒకు సమాచారం ఇవ్వగా పరిశీలి ంచి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరాతీశారు. మృత దేహం షర్ట్, నిక్కరుతో ఉంది. ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహన్ని మార్చురీకి తరలించి ఎస్ఐ సత్యనారాయణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కూలీ మృతి


దుర్యోధన (ఫైల్)

ఇచ్ఛాపురం : మండలంలోని చిన్నలక్ష్మీపురానికి చెందిన దున్న దుర్యోధన (56) ఉపాధి పనులు చేస్తూ స్పృహ కోల్పోయి అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం ఉదయం 7 గంటలకు గ్రామస్తులతో పాటు దుర్యోధన ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తున్న సమయంలో 7.30 గంటలకు ఒక్కసారి సొమ్మసిల్లి పడిపోయాడు. హుటాహుటిన సహచరులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య దాలమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఫిబ్రవరిలో కుమారుడి వివాహమైంది. అందరితో సరదాగా ఉండే దుర్యోధన ఇలా ఆకస్మికంగా మృతి చెందడం కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి.

పుస్తెలతాడు చోరీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో సింగన్నపాలెంకు చెందిన యరాబాటి వరలక్ష్మి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు ఆమె మెడ నుంచి మూడు తులాల బంగారాన్ని దొంగిలించినట్లు ఆమె తెలిపారు. ఆమె భర్త బాబూరావు పాలకొండ ఆర్‌టిసి డిపోలో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం 7 గంటల సమయంలో బాబూరావు డ్యూటీకి వెళ్ళిపోగా ఆమె ఒంటరిగా తమ ఇంట్లో గజాల తలుపులు వేసుకుని నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో నుంచి పుస్తెలతాడుని దొంగిలించాడు. వెంటనే కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి వెతికేసరికి అప్పటికే పరారైపోయాడు. బాధితురాలు శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ జి.వి.ప్రసాద్ తెలిపారు. రాత్రి సమయంలో ఇంటి బయట నిద్రించకూడదని, తరచూ ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని, ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఇంట్లో నిద్రించాలని ఎస్ఐ తెలిపారు.


నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సవర మురికింటిభద్రలో శనివారం పోలీసులు కార్డాన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం సిఐ నల్లి సాయి, మెళియాపుట్టి ఎస్ఐ టి.రాజేష్, పాతపట్నం ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్లు నరికితే చర్యలు

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ స్థలాల్లోని చెట్లను అక్రమంగా నరికివేస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బి జెఇ రాజశేఖర్ హెచ్చరించారు. మండలంలోని డోల రోడ్డులో ఇరువైపులా ఉన్న చెట్లను కొందరు వ్యక్తులు నరికివేశారు. విషయం తెలుసుకున్న ఆయన చెట్ల దిమ్మలను, కొమ్మలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం శాఖ ద్వారా చెట్లు నాటి దాని పెంపునకు నిధులు మంజూరు చేశామని అన్నారు. వాటిని అక్రమార్కులు నరికి వేయడం చట్ట రీత్యా నేరమని హెచ్చరించారు. ఇటువంటి వారిపై కేసు నమోదు చేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

రేపు పోలాకి మండల సమావేశం

పోలాకి: ఈ నెల 27న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఉషశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దమయంతి అధ్యక్షతన నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరు కావాలన్నారు.

టెక్కలిలో చిరుజల్లులు

టెక్కలి : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన వాయుగుండం ఫలితంగా శనివారం టెక్కలిలో చిన్నపాటి జల్లు కురిసింది. కొద్ది రోజుల నుంచి ఎండల వేడిమితో అతలాకుతలమైన ప్రజానీకానికి శనివారం సాయంత్రం నాటి వాతావరణం ఉపశమనం కలిగించింది. సాయంత్రానికి మబ్బులు కమ్ముకుని తేలికపాటి జల్లు కురవడంతో ప్రజలు ఉపశమనాన్ని పొందారు. అదేవిధంగా చుట్టుపక్కల వాతావరణంలో ఉరుములు, మెరుపులుతో కూడిన ఘర్జనలు చోటు చేసుకున్నాయి.

దేశ విముక్తికి అదే సరైన మార్గం

పలాస: భారత విముక్తికి నక్సల్బరి పందా సరైన మార్గమని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పేర్కొన్నారు. 57 ఏళ్ల నిండుతున్న నక్సల్బరికి విప్లవ జేజేలు పలుకుతూ నక్సల్బరి ఉద్యమ వారసత్వాన్ని ఎత్తుపడుతూ వెలుగెత్తి చాటాలని పిలుపునిచ్చారు. తర్లాకోట పంచాయతీ కొట్టారింగిలో నక్సల్బరికి జేజేలు అంటూ నినాదాలు ఇస్తూ శనివారం ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ దేశంలో దున్నేవానికి భూమి నినాదంతో వ్యవసాయక విప్లవాన్ని విజయవంతం చేయాలంటే నక్సల్బరి మార్గం, సాయుధ పోరాట మార్గమే సరైన మార్గమన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సవర బంగ్లా కుమార్, పాపారావు, సోమేశ్వరరావు, ఆనంద్, గోవింద్, కుమారి, దేవేందర్, భువన్‌కుమార్, విశాల్, అప్పారావు పాల్గొన్నారు. బొడ్డపాడులో నిర్వహించిన కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు సన్యాసిరావు, రామారావు, అప్పారావు కైలాష్, న్యూడెమోక్రసీ నాయకులు బాలకృష్ణ, కుసుమ రాపాక మాధవరావు, గోపి,రామకృష్ణ, ఉమాపతి పాల్గొన్నారు.